# కావ్యన్యాయం

సుష్మ చాలా అందంగా ఉంటుంది. ఎప్పుడూ నవ్వుతూ త్రుళ్ళుతూ ఉంటుంది. చీకూ చింతాలేనట్లు ఉంటుంది. సుష్మతో నా పరిచయం తమాషాగా జరిగింది. రోజూ ఒకే బస్సుస్టాపులో ఇద్దరమూ తొమ్మిది గంటల బస్సుకోసం నిల్చునే వాళ్ళం. ఒకే బస్సు ఎక్కేవాళ్ళం. ఒకే బస్సుస్టాపులో దిగేవాళ్ళం. ఆ తర్వాత ఆమె దారి ఆమెది, నా దారి నాది. ఒకటి రెండు రోజులు చూపులతో పలకరింపులు. మూడో రోజు కనిపించీ కనిపించని నవ్వు. ఆ తర్వాత అసలు పరిచయం.

ఆ రోజు బస్సు ఎక్కటంలో ఆమె పూలరుమాలు జారిపోతే నేను తీసి ఇచ్చాను.

"థ్యాంక్సు" అంది చిరునవ్వుతో. తను కూర్చున్న సీట్లోనే స్థలం చూపించింది. "ఎక్కడ పని చేస్తున్నారు" అని అడిగింది. "ఫలానా ఆఫీసులో క్రొత్తగా చేరాను" అని చెప్పాను.

"మీరు ఏకాలేజిలో చదువుతున్నారు" అని అడిగాను ఆమె చేతుల్లోని పుస్తకాల దొంతర చూసి.

"ఫలానా లేడీస్ కాలేజిలో" అని చెప్పింది. బి.యస్.సి. ఫైనలియరట.

ఆ పరిచయం స్నేహంగా మారింది. ఒకర్ని ఒకరు విజిట్ చేయటం దాకా వచ్చింది. సుష్మ తండ్రి సెంట్రలు గవర్నమెంటులో పెద్ద ఆఫీసరు, విశాలంగా, చక్కగా ఉన్న క్వార్టర్సులో ఉంటున్నారు. సుష్మ ఒకతే ఆయన సంతానం.

ఒకసారి సుష్మా నేనూ షాపింగుకు వెళ్ళాము. ఎండ మండిపోతోంది. బాగా దాహం వేస్తోంది. వీధి ప్రక్కన ఉన్న షాపు దగ్గర కూల్ డ్రింక్ కోసం ఆగాము. బాటిల్సు చేతిలో పట్టుకోగానే ఎవరో నా చెయ్యి లాగుతున్నట్లు అనిపించింది. వెనక్కు చూడగానే నాకు ఒళ్ళుమండింది. జీబురుతలతో ఉన్న మురికి పిల్ల, మురికి చెయ్యి ముందుకు చాపింది. "ఛీ! పో" అన్నాను.

సుష్మ చూసింది, "కాంపాకోలా తాగుతావా?" అని అడిగింది ఆ పిల్లను.

ఆ పిల్ల తెల్లబోయింది. షాపువాడికి చెప్పి ఇంకో బాటిలు ఆ పిల్లకు ఇప్పించింది.

మేమివతలికి వచ్చేశాం, నేను చాలా గిల్టీగా ఫీలవుతున్నాను. నేను 'ఛీ' కొట్టిన ముష్టి పిల్లపైన సుష్మ అంతదయ చూపిందంటే నాలోని కుసంస్కారాన్ని వేలెత్తి చూపినట్లే కదా!

"ఏదో ఆలోచిస్తున్నావు" అంది సుష్మ.

"ఏం లేదు సుష్మా."

"ఏం లేకపోవటమేం, ఏదో ఉంది."

"ఇందాకా నేను పొమ్మన్న ముష్టి పిల్లక్కు కూల్ డ్రింకు ఎందుకు ఇప్పించినట్లు? నన్ను కించపరచాలనే కదూ!"

"నో శ్యామా, అలా అనుకోకు, మనకెంత దాహంగా ఉందో దానికీ అంతే దాహంగా ఉంటుందని."

"అంద దయగలదానివి డబ్బులివ్వక పోయావా? దాని ఆకలి కడుపుకు కాంపాకోలాతో ఊరట దొరుకుతుందా?"

"ఐయామ్‌సారీ, నాకు ఆ ఆలోచనే రాలేదు."

ఆ తర్వాత మేము షాపింగ్ ధ్యాసలో పడిపోయాము.

ఎండాకాలం పోయింది. వానాకాలం వచ్చింది. అదీ దాని దారినపోయింది. చలికాలం వచ్చింది. సుష్మ నాకొక స్వెటరు అల్లి పెట్టానంది. నా కొలతలు తీసుకోటానికి వాళ్ళింటికి పిలిచింది. ఆ రోజు ఆదివారం. లోపల అడుగు పెట్టగానే సుష్మ తల్లి సుష్మను చీవాట్లు పెట్టడం వినిపించింది. లోపలికి వెళ్ళాలా వద్దా అని అనుమానిస్తూ డ్రాయింగ్ రూమ్‌లోనే నిలబడిపోయాను.

ఇంతలో సుష్మ వచ్చింది. మొహం చిన్నబోయి ఉంది. "రా శ్యామా నాగదికి వెళ్దాం" అంది. సుష్మ తల్లి కూడా డ్రాయింగ్ రూంలోకి వచ్చింది.

"నీ స్నేహితురాలి ఘనకార్యం విన్నావా అమ్మా" అంది.

"ఊరుకో అమ్మా, శ్యామ వింటంటే నవ్వగలదు నువ్వు చేసే రాద్ధాంతానికి."

"నాది రాద్ధాంతమా? నువ్వు చేసిన పని బాగుందా? చూడమ్మా శ్యామా, నిరుడు చలికాలంలో కొన్న రెండు వందలరూపాయల కోటు పనిమనిషికి దానం చేసింది. రూపాయలు చెట్టున కాస్తున్నాయా? ఈమెకున్న దానగుణం మనకు లేకనే ఇలా ఉన్నామా? తనదేం పోయింది? రేపీపాటికి మరోకోటు కొనవలసిన బాధ్యత వాళ్ళనాన్న గారిదే కదా?"

"ఈ మాటలకేంలే శ్యామా, రారా నీ కొలతలు తీసుకోవాలి," అంటూ సుష్మ నన్ను తన గదికి లాక్కెళ్ళింది.

"నిజంగానే నీ కోటు దానం చేశావా?" అని అడిగాను.

"నిజమే. అమ్మను అడిగి ఇస్తే బాగుండేదేమో! అప్పుడు తను ఇవ్వనిచ్చేదే కాదు. అసలు అదంతా ఒక్క క్షణంలో జరిగిపోయింది."

"సరేలే. నీసంగతి తెలిసిందేగా" అన్నాను నా స్వెటరు బటన్లు అన్నీ పెట్టుకొని ముడుచుకుపోతూ.

"చాలా చలిగా వుందికదూ. వుండు బ్లోవర్ ఆన్ చేస్తాను. గది వెచ్చబడుతుంది" అని అది ఆన్ చేసింది.

ఢిల్లీ చలి అసలే అలవాటు లేదు. అందులో రెండు మూడు రోజులుగా కోల్డువేవ్ గాలులు చల్లగా వీస్తున్నాయి. టెంపరేచరు మూడు సెంటిగ్రేడులకు పడిపోయింది.

"చూడు మనకే ఇంతచలిగా వుందా,...." అని సుష్మ ప్రారంభించింది. "నిన్న నేను కాలేజి నుండి వచ్చేసరికి ఆలస్యమయింది. వస్తుంటే దారిలో మా పనిమనిషికూతురు కనిపించింది. ఏదో పాత చీర చుట్టబెట్టుకుంది. నన్ను చూడగానే 'నాకు తమ్ముడు పుట్టాడు' అంది.

"తమ్ముడు పుట్టాడా? ఇంకేం ఆ సంతోషంలో నీకు చలికూడ తెలిసేటట్టు లేదు" అన్నాను.

"అబ్బ చలికి చస్తున్నాను బహెన్‌జీ. వున్న రెండు దుప్పట్లూ అమ్మకు కప్పేశారు. ఈ రాత్రి ఎట్లా గడుస్తుందో."

నాకెలాగో అన్పించింది. నాపై నున్న కోటువిప్పి దానికిచ్చేశాను. అది మొదట్లో వద్దంది, వాళ్ళమ్మ కోప్పడుతుంది అంది. పర్వాలేదులే నీ తమ్ముడికిచ్చాను. తీసికెళ్ళి వాడికి కప్పు అన్నాను. ఆ పళాన కోటందుకొని చెంగు చెంగున దూకుతూ వెళ్ళిపోయింది.

ఇందాక పనిమనిషి మొగుడొచ్చి అమ్మను అడిగాడు, కోటు నిజంగానే ఇచ్చారా లేక పిల్లది దొంగతనం చేసిందా అని. నేను అక్కడే వున్నాను గనుక సరిపోయింది. వాడు సంతోషంగా నమస్కారం బెట్టిపోయాడుగాని అప్పటి నుండి అమ్మ నన్ను దుయ్యబట్తోంది" అంటూ నవ్వింది సుష్మ.

"ఏమిటో సుష్మా నీది మరీ విపరీతం, ఏ పని చేసేపుడయినా కాస్త వెనుకా ముందు చూసుకోవు?"

"మొదటి నుంచీ నేనంతే. బుర్రలోకి ఏదివస్తే అది చెయ్యటమే. కాని కొంచెం అవగాహన వచ్చాకే నా ఆలోచనలు నాకే బాధాకరంగా తయారయ్యాయి."

"అదేమిటి?"

తనుకాస్త గంభీరంగా మారిపోయింది.

"ఈ ఆలోచన నాకెలా వచ్చిందో చెప్పలేను శ్యామా. ఎక్కడయినా నేను చదివానో, విన్నానో, లేక నాలోనే ఈ కలవరం పుట్టిందో తెలీదు. 'బర్త్ ఈజ్ యాన్ యాక్సిడెంట్'. మనం ఏ ఇంట్లో, ఏ పరిస్థితులలో పుట్తామో మన చేతుల్లో ఏముంది. నేనుమా పనిమనిషి ఇంట్లో పుట్టి ఉంటే ఏమయ్యేది? ఎవరింట్లోనో పాత్రలు తోముకోవలసివచ్చేది. అలాగే దీనావస్థలో వున్న వారిని ఎవరిని చూసినా వారే నేనయితే అనే ఆలోచన నన్ను కలవరపెట్తూ వుంటుంది. ఆ కలవరపాటును కప్పిపుచ్చుకోటానికి ఏదో చేస్తుంటాను. అది చూసే వారికి వింతగా విపరీతంగా వుంటుందనుకొంటాను," అంటూ చిరునవ్వు నవ్వింది.

తనధోరణి మళ్ళించాలని "బలేదానివే. బిచ్చగత్తెలో నిన్ను చూసుకొనే బదులు లక్షాధికారిణితో పోల్చుకోక పోయావా?" అన్నాను.

"అరె... అదీ నిజమే. ఈ ఆలోచన నాకు తట్టనే లేదు. కాని మనకు బిచ్చగత్తెలు, రోగిష్టులు, దీనులు ఎదురయినంతగా లక్షాధికారులు ఎదురవటంలేదు కదా!"

ఆ తర్వాత తన ఫ్రెండు శీతల ఏదో యాక్సిడెంటులో చనిపోయింది. ఆషాక్ నించి

కోలుకోటానికి సుష్మకు ఒక నెలపైనే పట్టింది. తను నిస్సహాయంగా ఎంత బాధను అనుభవించిందో ఊహించుకు, ఊహించుకు కుమిలిపోయింది.

ఇప్పుడు సుష్మ ధోరణులన్నిటికీ అలవాటు పడ్డాను. బ్లైండు స్కూలు ముందర వెళ్ళేటప్పుడు పరుగెట్టు కెళ్ళి వీధి దాటాలనుకొన్న వారికి సాయంచేస్తూ ఉంటుంది. అడిగినవాళ్ళకు లేదనకుండా పైసలు దానం చేస్తూ ఉంటుంది. ఎదుటివాళ్ళు కట్టుకథలు చెబుతున్నారని తెలిసీ నవ్వుతూ ఒకటో రెండో రూపాయలు వాళ్ళ చేతుల్లో పెట్టుంది. ఒకసారి తను బస్సెక్కబోతూంటే పుస్తకాలన్నీ జారిపడ్డాయట క్రింద నుండి ఎవరో పుస్తకాలందించారు. థ్యాంక్సు చెప్పింది. బస్సు కొంచెం దూరం కదిలాక కండక్టరు టిక్కెట్టు అడిగాడు చూస్తే... పర్సు లేదు. పాపం మరెవరో తన టికెట్టుకు డబ్బు లివ్వాల్సి వచ్చిందట. ఈ విషయం చెప్పి పడి పడీ నవ్వింది.

ఉద్యోగంలో చేరి రెండేండ్లయింది. వేసవి సెలవులకు ఇంటికి వెళ్ళేముందు సుష్మను కలిశాను. "ఏం తీసుకురమ్మంటావు?" అని అడిగాను.

"మీవైపు పట్టుచీరలు బాగుంటాయి. ముఖ్యంగా మద్రాసువి. అయినా నువ్వు మద్రాసు వెళ్ళవుగా" అంది.

"వెళ్తున్నాను. మద్రాసు మీదుగానే నా ప్రయాణం" అన్నాను.

"అయితే పెద్దంచు జరీపట్టుచీర ఎర్రది పట్టుకురా. చిన్న చిన్న జరీ బూటాలుండాలి సుమా!"

"ఏం పాపం పెళ్ళిచీర కోరుకొంటున్నావు?"

"ఈ ఏడాది యం.యస్.సి. పూర్తి అవుతుంది ఆ తర్వాత అదే కార్యక్రమం...." అంటూ నవ్వింది.

ఇంటికి వెళ్ళకముందే మద్రాసులో రెండు రోజులు ఆగాను. అప్పుడే సుష్మ కోరుకున్న చీర కొన్నాను. నెలరోజులు ఇంటిదగ్గర ఎలా గడిచాయో నాకే తెలీదు. ఆ సందడిలో ఇంచుమించు సుష్మను మరచి పోయాను. తనూ నాకు ఉత్తరం వ్రాయలేదు. తనకు వ్రాసే తీరుబడి నాకు లేదు. సెలవు పూర్తిగావచ్చింది. తిరుగు ప్రయాణ సన్నాహంలో ఉన్నాను. నా కోలీగ్ ఆనంద నుండి ఉత్తరం వచ్చింది... మామూలు పలకరింపులు కొన్ని ఆఫీసు విశేషాలు, ట్రాన్స్‌ఫర్లు, న్యూ పోస్టింగులు...

"…. ఈ ఉత్తరం నీకు చేరేసరికే తిరుగు ప్రయాణానికి తయారవుతూ ఉంటావు. ముఖ్యంగా నీకు ఒక విషయం తెలియ బరచాలనే ఈ ఉత్తరం వ్రాస్తున్నాను. నీ ఫ్రెండు సుష్మ, ఆమె స్నేహితురాలు మొన్న రాత్రి సినిమాకు వెళ్ళి వస్తున్నారట. బస్సు టెర్మినస్ దగ్గర దిగిపోతుంటే "మీరింకెంత దూరం వెళ్ళాలి" అని కండక్టరు అడిగాడట. సుష్మ తమ కాలనీ పేరు చెప్పింది. "బస్సు డిపోకు ఆ దారినే వెళ్తుంది. మీ ఇంటికి దగ్గరగా దింపుతాం. ఇంత రాత్రిలో ఇక్కడి నుంచి నడిచి వెళ్ళటమెందుకూ?" అన్నాడట. వీళ్ళిద్దరు సరేనన్నారు. బస్సు బాగా స్పీడందుకొని బుద్ధ జయంతి పార్కు రోడ్డు పట్టిందట. అక్కడ పగలే ట్రాఫిక్ తక్కువ. ఇక రాత్రి సంగతి చెప్పాలా? సుష్మ, ఆమె స్నేహితురాలు కేకలు బెట్టి బండిని ఆపమన్నారట. బండి ఆగలేదు. కండక్టరు సుష్మ ఫ్రెండుపై అఘాయిత్యం చేయబోతే ఆ అమ్మాయి బస్సు నుండి దూకేసింది. కండక్టరు భయపడి సుష్మను క్రిందకు తోసేశాడు. సుష్మ అక్కడిక్కడే చనిపోయింది. ఆమె ఫ్రెండు ఆస్పత్రిలో ఉంది. నిన్న ఇక్కడి పేపర్లన్నిటిలో ఈ న్యూసే. నీకు ఇది ఎంత బాధ కలిగిస్తుందో తెలిసీ…"

తెలిసి ఎవరు మాత్రం ఏం చేయగలరు? సుష్మ "బర్త్ ఈజ్ యాన్ యాక్సిడెంట్" అని చెప్పింది. కాని చావు గురించి ఎన్నడూ మాట్లాడలేదు. మంచికి మంచీ చెడుకు చెడూ ఫలితాలుంటాయని అందరూ చెబుతుంటారే - ఆ "కావ్యన్యాయం" ఎక్కడుంది? పుస్తకాలలోనా?

*(నవంబరు - డిసెంబరు 1980)*